క్లుప్తంగా

నేడు 'గొంతెమ్మ' బోనాలు

పెంచికల్‌పేట్: మండలంలోని మెరెగూడ గ్రామసమీపంలోని గొంతెమ్మ ఆలయంలో సోమవారం బోనాల పంగున ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి మానెపల్లి రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కాగజ్‌నగర్‌లో మాయావతి జన్మదిన వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కుమారి మాయావతి 68వ జన్మదిన వేడుకలను సోమవారం ఉదయం 11 గంటలకు కాగజ్‌నగర్ (కోసిని)లో నిర్వహించనున్నట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ, మండల, గ్రామస్థాయి నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన హోంగార్డు అల్లూరి పోచం ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.10వేలు, క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ హోంగార్డు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గుండాయిపేట్‌లో అక్షింతల పంపిణీ

కౌటాల: మండలంలోని గుండాయిపేట్ గ్రామంలో అయోధ్య పూజిత అక్షింతలను ఆదివారం గడపగడపకు పంపిణీ చేశారు. స్థానిక హనుమాన్ ఆలయం నుంచి వేదపండితుల ప్రత్యేక పూజల అనంతరం అక్షింతలను భాజాభజంత్రీలు, మంగళహారతులతో గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

20న కవి సమ్మేళనం, గాన లహరి

ఆసిఫాబాద్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో సాయంత్రం 5.30 గంటలకు కవి సమ్మేళనం, గానలహరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ మండల అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో రామాయణంలోని ఒక ఘట్టంపై కార్యక్రమం ఉంటుందన్నారు. కవులు కవితలు చదవాలని, గాయకులు సంగీతాన్ని ఫోన్‌లోని ట్రాక్‌పై ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 18న సాయంత్రం 6 గంటల్లోగా తమ పేర్లను 9014206234, 9490918014లకు వాట్సప్ చేసి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని తీరందాజ్ ప్రాంతంలో పది మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు డీఎస్పీ కరుణాకర్, ఎస్సై శ్రీకాంత్‌లు తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఆదివారం కాలనీలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ఇంట్లో పది మంది పేకాట ఆడుతున్నట్లు గుర్తించామన్నారు. వారిని అరెస్టు చేసి రూ.20వేల నగదు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

'పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా'

కాగజ్‌నగర్‌టౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్ బ్రాహ్మణవాడలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు –శివాని దంపతులతో పాటు మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాగజ్‌నగర్ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ట్రాఫిక్ జామ్..!

- రోడ్డుపైనే దుకాణాలు
- పెరిగిన వాహనాల వినియోగం
- రోడ్లు విస్తరించాలని వేడుకోలు



కౌటాలలో ట్రాఫిక్‌జామ్



రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు

కౌటాల: జిల్లాలోనే కౌటాల మండల కేంద్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియా, మొగడ్‌దగడ్ రోడ్డు, విజయనగరం రోడ్డు సమీపంలో గుంట స్థలం కొనుగోలు చేయాలంటే రూ. 12లక్షలకు పైగా పలుకుతోంది. కౌటాలతో పాటు చింతలమానెపల్లి, సిర్పూర్(టి), బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ ఉద్యోగాలు, పలువురు వ్యాపారులు కౌటాలలోనే ఇళ్లను అద్దెకు తీసుకొని ఉంటున్నారు. దీంతో మండల కేంద్రంలో జన సంచారం పెరుగుతోంది. వాహనాల వినియోగం సైతం పెరగడంతో పాటు రోడ్డుకు పక్కనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో మండల కేంద్రంలో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇరుకు రోడ్లతో తిప్పలు..

కౌటాలలోని ఇరుకురోడ్లతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతీ సోమవారం కౌటాలలో నిర్వహించే వారసంతకు వేలాదిగా వ్యాపారులు, వినియోగదారులు వస్తుంటారు. వారసంత రోజు కౌటాల –బెజ్జూర్ ప్రధానరోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. వాహనదారులు రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కంకర లోడ్‌తో టిప్పర్లు నడుస్తుండడంతో మార్కెట్ ఏరియాలో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి అంబులెన్స్ రావాలంటే వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా, కుమురం భీం చౌరస్తా, మొగడ్‌దగడ్ చౌరస్తా, తలోడి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. దీంతో ప్రతీరోజు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. కౌటాలలో జిన్నింగ్ మిల్లు ఉండడంతో సమీప మండలాల నుంచి వందల సంఖ్యలో పత్తి వాహనాలు వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. దీంతో వాహనచోదకులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

రోడ్డు వెడల్పు చేయాలని డిమాండ్..

నాలుగేళ్ల క్రితం కౌటాల నుంచి బెజ్జూర్ వరకు డబుల్ రోడ్డు వేశారు. మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పేరుకుపోవడంతో డబుల్ రోడ్డు సైతం సింగిల్ రోడ్డుగా మారింది. దీంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. కౌటాలలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కౌటాల మినీ స్టేడియం నుంచి తలోడి దసలి పట్టు పరిశ్రమ వరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు విస్తరించడంతో పాటు మధ్యలో డివైడర్, సెంట్రింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మండల కేంద్రంలోని మొగడ్‌దగడ్, విజయనగరం, తలోడి రోడ్లను సైతం డబుల్ రోడ్డుగా మార్చాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

శ్రీసాయి ఆలయంలో ముగ్గుల పోటీలు



ముగ్గు వేస్తున్న మహిళలు



మహిళలు వేసిన ముగ్గులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం న్యూ కాలనీలో గల శ్రీ సాయి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మంచి స్పందన లభించింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. సమితి తరఫున మొదటి, రెండో, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి పదాధికారులు, మహిళలు పాల్గొన్నారు.

16న ముగ్గుల పోటీలు

ఆసిఫాబాద్‌అర్బన్: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రేపు మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో మధ్యాహ్నం 2 గంటలకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. క్లబ్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

పతంగుల పంపిణీ



పతంగులు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలో అమ్మదీవెన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 200 మంది చిన్నారులకు పతంగులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని చిల్డ్రన్స్ పార్కు, టీఆర్‌నగర్, బ్రాహ్మణవాడ, సందీప్‌నగర్, తుమ్మిగుడా ప్రాంతాల్లో పతంగులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రశాంత్, సిద్దంశెట్టి క్రుపాల్, చీల నితీశ్, సత్యనారాయణ, రాజశేఖర్, అభిలాష్, ప్రతాప్, మల్లేశ్, శ్రీకాంత్, సంతోష్, సత్యనారాయణ, చిన్నారులు పాల్గొన్నారు.

నేడు గాలిపటాల ఎగురవేత

ఆసిఫాబాద్‌అర్బన్: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని నేడు జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఆవరణలో ఉదయం 9 గంటలకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాలిపటాల ఎగురవేత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు కొలిపాక శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో భోగి వేడుకలు

ఆసిఫాబాద్: జిల్లా వ్యాప్తంగా భోగి సంబరాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు పేర్చి, భోగిపండ్లు పోసి, వాకిళ్లను అలంకరించారు. గ్రామాల్లో పిండివంటల ఘుమఘుమలు, అరిసెలు, సకినాలు, స్వీట్లు తయారు చేశారు. ఆదివారం వేకువజామున నిద్ర లేచి తలస్నానాలు చేసి, భోగి మంటలు వేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిన్నారులకు బియ్యం, నువ్వులు, రేగుపండ్లు, చిల్లర నాణాలు కలిపి భోగి పండ్లు పోశారు.

కౌటాల: మండల వాసులు ఆదివారం భక్తిశ్రద్ధలతో భోగి పండుగ వేడుకలు నిర్వహించారు. భోగి మంటలు వేయడంతో పాటు ఇళ్ల ముందు ముగ్గులు వేశారు. సంక్రాంతి పురస్కరించుకొని మండల కేంద్రంలో పిండిగిర్నిల వద్ద ప్రజలు క్యూ కట్టారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

చింతలమానెపల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు.



కౌటాల: ముత్తంపేట్‌లో భోగి వేడుకల్లో చిన్నారి



కౌటాల: మహిళలు వేసిన ముగ్గులు

నిలిచిన 'బడి' పనులు!

- 'మన ఊరు –మన బడి' కింద 23 పాఠశాలలు ఎంపిక
- నిధులు మంజూరు కాకపోవడంతో ఆగిన పనులు
- నాలుగు పాఠశాలల్లో మాత్రమే పూర్తి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



అసంపూర్తిగా గొల్లగూడ పాఠశాల భవన నిర్మాణం

వాంకిడి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చేపట్టిన మన ఊరు –మన బడి కార్యక్రమం పనులు మండలంలో నిలిచిపోయాయి. మొదటి విడతలో మండలం నుంచి 23 పాఠశాలలు ఎంపిక చేయగా.. ఇప్పటి వరకు కేవలం నాలుగు పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. అర్జుగూడ, చిన్న బెండార, బంబార, ఒడ్డెరవాడ పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. 23 –2024 విద్యా సంవత్సరానికి ముందే పాఠశాలల్లో పనులు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటికీ అసంపూర్తిగానే ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

తప్పని తిప్పలు..

విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం 'మన ఊరు –మన బడి' కార్యక్రమాన్ని చేపట్టింది. కానీ క్షేత్రస్థాయిలో పాఠశాలల్లో పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. పాఠశాలల్లో ప్రహరీ గోడల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో కుక్కలు, పశువులు సంచరిస్తున్నాయి. మరుగుదొడ్లు, టాయిలెట్లలో నీటి సౌకర్యం లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోగా వాటి స్థానంలో కొత్తవి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా చాలా చోట్ల అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులు అసంపూర్తి గదుల్లో, శిథిలావస్థ భవనాల్లో బిక్కుబిక్కు మంటూ పాఠాలు వింటున్నారు.

అర్ధాంతరంగా నిలిచిన పనులు

పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధుల కొరత, బిల్లులు సక్రమంగా రాకపోవడంతో గుత్తేదార్లు పనులు చేయకుండా చేతులెత్తేశారు. దీంతో పాఠశాలల అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కొన్ని చోట్ల నిధులు మంజూరు కాక, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పనులు నిలిచిపోయాయి. మరి కొన్ని చోట్ల బిల్లులు రాకపోవడంతో పనులను మధ్యలో నిలిపివేశారు. అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో పనుల్లో జాప్యం నెలకొందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండలంలోని చిచ్‌పల్లి పాఠశాలలో కిచెన్ షెడ్ పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. అలాగే పాఠశాలకు నీటి సదుపాయం, మరుగుదొడ్లు పూర్తి కాలేదు. గొల్లగూడ కే పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం వెనుక భాగంలో మాత్రమే పూర్తి చేశారు. పాఠశాలలో టాయిలెట్‌లు కొంతవరకు పూర్తి చేసి మధ్యలోనే పనులు నిలిపివేశారు. పాఠశాలకు పెయింటింగ్ పనులతో పాటు మేజర్, మైనర్ పనులు చేయాల్సి ఉంది.

నిధులు మంజూరు చేయాలి



మన ఊరు –మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో కొన్ని పనులు పూర్తి చేశాం. పూర్తి చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నాం. జరిగిన పనులకు సంబంధించి ఇంకా రూ.12 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఉన్నతాధికారులు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– నాగుల నరేశ్, కాంట్రాక్టర్

ఉన్నతాధికారులకు నివేదించాం



పాఠశాలల ఆధునీకరణకు మండలం నుంచి 23 పాఠశాలలు ఎంపిక కాగా అందులో నాలుగు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పాఠశాలల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. పెండింగ్ బిల్లుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– మనుకుమార్, ఎంఈవో

'వైద్యుల్లో ఆణిముత్యం అడే అరవింద్'

నార్నూర్: మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ.. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ అడే అరవింద్ వైద్యుల్లో ఆణిముత్యమని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో గ్రామస్తులు, ఉద్యోగస్తులు స్వచ్ఛంద పదవి విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడే అరవింద్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతంలో పుట్టి పెరిగి ఉన్నత చదువులు చదువుకొని కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రిని నిర్మించి వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. తన సోదరుడు అడే అరుణ్ పేరుతో అరుణ్ మెమోరియల్ ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు సేవ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, మేడ్చల్ మేజిస్ట్రేట్ రాథోడ్ అజయ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, తిప్పేస్వామి, గణేశ్ రాథోడ్ పాల్గొన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు ధర!

- ఒక్కోటి రూ.7కు విక్రయం
- పండుగ వేళ పేద ప్రజల ఇక్కట్లు



కోడి గుడ్లు

కౌటాల: ఇటీవల కోడిగుడ్ల వినియోగం గణనీయంగా పెరగడంతో గుడ్డు ధర చుక్కలనంటుతోంది. మార్కెట్‌లో కోడిగుడ్డు ధర కొండెక్కడంతో పండుగ వేళ సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు నిత్యావసరల ధరలు పెరగగా, మరోవైపు చికెన్, మటన్, చేపల ధరలు కూడా మండుతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ధరలతో తిప్పలు

కోళ్లకు వినియోగించే దాన సరిపోకపోవడంతో అధిక ధర చెల్లించి ఇతర రాష్ట్రాల నుంచి దాన దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ఖర్చులు పెరగడంతో కోడిగుడ్ల ధరలు సైతం పెరుగుతూ వస్తున్నాయి. కార్తీక మాసంలో మాంసాహార వినియోగం తక్కువగా ఉండడంతో ధరలు అదుపులో ఉండగా, ఆ తర్వాత కోడిగుడ్ల ధరలకు రెక్కలొచ్చాయి. గత నెలలో ఒక్కో గుడ్డు ధర రూ.5.50 ఉండగా.. రెండు వారాల క్రితం రూ.6కు చేరింది. డజన్ గుడ్ల ధర వారం రోజుల్లో రూ.72 నుంచి రూ. 84కు చేరింది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో ఒక గుడ్డు రూ. 7.50 నుంచి రూ. 8కు అమ్ముతున్నారు. చలి తీవ్రత పెరగడం, ఉత్పత్తి తగ్గడంతో కోడిగుడ్ల ధర పెరుగుతోందని భావిస్తున్నారు. కోడిగుడ్ల వినియోగానికి డిమాండ్ పెరగడంతో మారుమూల గ్రామాలు, రవాణా సౌకర్యం అంతగా లేని గ్రామాల్లో గుడ్డును రూ.8 వరకు విక్రయిస్తున్నట్లుగా తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజు సుమారు 50వేల గుడ్ల వినియోగం ఉందని అధికారులు చెబుతున్నారు. సామాన్యులను పెరిగిన కోడి గుడ్డు ధర బెంబేలెత్తిస్తోంది. పండుగ వేళ చికెన్, మటన్ కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో ఉన్న వారు కోడిగుడ్డు కొనాలన్నా హడలిపోతున్నారు. కోడిగుడ్ల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తాండూర్: మండలంలోని రేపల్లేవాడలోని హన్‌మాన్ దేవాలయంలో ఆదివారం ఓపెన్ టు ఆల్ చదరంగం పోటీలు నిర్వహించారు. పోటీలకు తాండూర్ మండల ఫొటోగ్రాఫిక్ యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, అంతర్జాతీయ క్రీడాకారుడు ఆకాష్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదరంగం పోటీల వల్ల మేధస్సు చురుకుగా పనిచేస్తుందన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరూ ఆటలో రాణించాలని ఆకాంక్షించారు. పోటాపోటీగా జరిగిన ఈ పోటీల్లో భువన్ రుషి(ప్రథమ), ఆకుల అజయ్(ద్వితీయ), మహేష్ (తృతీయ)బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి విశ్వనాథ్, నిర్వాహకులు బహుమతిని అందజేశారు. కుమార్ బ్రదర్స్ అకాడమీ చైర్మన్ సమ్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

తలమడుగు: మండలంలోని బరంపూర్ కొండపైన ఉన్న శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం, పూజ కార్యక్రమాలు చేపట్టారు. అర్లి, తలమడుగు, రుయ్యడి, కోత్తుర్ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర్ రెడ్డి, భూమారెడ్డి, మల్లేష్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గ్రామస్తుల సమక్షంలో నిర్వహించారు. వేద పండితులు నేరేళ్ల కల్యాణచారి, పరమేశ్వరయ్య ఆధ్వర్యంలో హోమం, అర్చన, చతుర్చాచన, గోదాదేవి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు శివ దత్తగిరి మహరాజ్, సర్పంచ్ రాజన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

తాండూర్: మండలంలోని బోయపల్లిలో ఆదివారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. మాసాడి విష్ణువర్ధన్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీటీసీ, శ్రీ బుగ్గ రాజరాజేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ మాసాడి శ్రీదేవి, గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ రౌతు వెంకటేశం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. యువకులు క్రీడా స్ఫూర్తితో క్రికెట్ ఆడి రాణించాలని వక్తలు అన్నారు.

ఘనంగా భీమదేవర జెండా పండుగ

తాండూర్: మండలంలోని భోయపల్లి గ్రామంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో భీమదేవర జెండా పండుగను మన్నెవార్, కొలవార్ శ్రేణులు జరుపుకున్నారు. మన్నెవార్‌ల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా గ్రామ పొలిమేరలో ఉన్న భీమదేవర వరకు శోభాయాత్ర చేపట్టారు. వాయిద్యాల చప్పుళ్ల మధ్య కోళ్లు, మేకలతో చిన్నాపెద్దా అనే తేడా లేకుండా బోనం తీశారు. ఆట పాటలతో భీమదేవర పండుగను మన్నెవార్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు గొలిశెట్టి బాపు, మండల ప్రధాన కార్యదర్శి ఎలిగేటి రమేష్, గౌరవ అధ్యక్షుడు భాపు, స్కూల్ చైర్మన్ చంద్రయ్య, ఉద్యోగ సంఘం నాయకులు కనుకయ్య, గ్రామ అధ్యక్షుడు భార్గవ్, ప్రధాన కార్యదర్శి రాంబాబు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.